

కె. బాలగోపాల్

# సమాచార స్వేచ్ఛ - బ్యూరోక్రాట్ల భయం

ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం పొందడం ఎంత కష్టమో మనకందరికీ తెలుసును. మనకు సంబంధించిన సమాచారమే అయినా, అది మనకు తెలియడం మనకు అత్యవసరమైనా, మనకది తెలియడం వల్ల వేరే ఎవ్వరికీ ఏ హానీ లేకపోయినా, ఆ సమాచారం పొందడం చాలా కష్టం. సీట్లో కూర్చున్న గుమస్తా దొరవారు, హెడ్ గుమస్తా దొరవారు, సూపరింటెండెంట్ దొరవారు, ఆఫీసర్ దొరవారు కనికరిస్తే తప్ప ఏ కాగతమూ చూడలేము, ఏ రికార్డూ పరిశీలించలేము. ఏ నిర్ణయం ఎక్కడిదాకా వచ్చిందో తె

విద్యావంతులకు ఈ రహస్యాన్ని ఛేదించడం అప్పుడప్పుడు సాధ్యమవుతుందిగానీ పేదలకు, ముఖ్యంగా గ్రామీణ రైతులకు చాలా కష్టం. దానికొక్కటే మార్గం - ఏ నాయకుడినో, పైరవీకారుడినో పట్టుకోవడం లేదా లంచాలు ఇచ్చుకోవడం.

ప్రభుత్వ వ్యవహారాలలో పారదర్శకత (ట్రాన్స్‌పెరెన్సీ) లేనిదే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు కాబట్టి ప్రభుత్వ కార్యాలయాలలో తమ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని పొందడం ప్రజల అవసరమే కాక ప్రజాస్వామ్యం అవసరం కూడా. దీని గురించి మనదేశంలో చాలాకాలం పట్టింపులేదు. అనేక ఇతర హక్కుల గురించి ఆందోళనలు చేపట్టిన వామపక్ష ఉద్యమాలు, పౌరహక్కుల ఉద్యమాలు సహితం సమాచార స్వేచ్ఛను ఒక సమస్యగా చేపట్టలేదు. అది లంచాలిచ్చి, పైరవీ చేసుకొని పొందే సదుపాయంగా ఉండిపోయింది.

ఈమధ్య కాలంలోనే కొన్ని రాష్ట్రాలలో సమాచార స్వేచ్ఛకోసం ఆందోళనలు మొదలయ్యాయి. రాజస్థాన్‌లో రైతాంగ ఉద్యమ కార్యకర్తలు తమ ఉద్యమం డిమాండ్ల సాధన సమాచార స్వేచ్ఛతో ముడిపడి ఉందని గుర్తించి సమాచార స్వేచ్ఛకోసం ఉద్యమం చేపట్టారు. ఐఎఎస్ అధికారిగా ఉండి రాజీనామా చేసిన అరుణరాయ్ ఆ ఉద్యమానికి సారథ్యం వహించారు. ఆ తరువాత ఇతర రాష్ట్రాలలో కూడ అటువంటి ఉద్యమాలు మొదలయ్యాయి. ఆ డిమాండ్ ప్రజా ఉద్యమాల డిమాండ్లలో ఒకటి అయింది.

ఈ ఒత్తిడి వల్ల కొంత, మధ్య తరగతిలో పెరుగుతున్న ప్రజాతంత్ర చైతన్యం వల్ల కొంత, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు సమాచార హక్కుకు చట్టరూపం ఇచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టాయి. తమిళనాడు, గోవా రాష్ట్రాలలో ఇప్పటికే సమాచార హక్కు చట్టాలొచ్చాయి.

అంతవరకు బాగానే ఉందిగానీ, సమాచార హక్కు ప్రజలకివ్వడం ప్రభుత్వ అధికార్లకు ఇష్టం ఉండదు కాబట్టి ఈ చట్టాలకు ఎన్ని తూట్లు పెట్టాలో అన్నీ వాళ్ళు పెడుతున్నారు. ఈ తూట్లు చట్టంలో 'మినహాయింపుల' రూపంలో ఉంటాయి. సమాచార హక్కంటే అడిగిన అన్ని విషయాలూ చెప్పడం అని ఎవ్వరూ అనలేరు కదా. కొన్ని మినహాయింపులు ఉండకతప్పదు. ఉదాహరణకు బడ్జెట్‌లో ఏ వస్తువులపైన ఎక్సైజ్ పన్ను పెంచబోతారో లేక తగ్గించబోతారో ముందే తెలుసుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలన్నామనుకోండి. వ్యాపారస్తులు దానిని వాడుకొని పెరగబోయే వస్తువులను దాచిపెట్టి బడ్జెట్ తరువాత అమ్మి వివరీతంగా లాభాలు సంపాదించుకోవచ్చు. కాబట్టి కొన్ని పరిమితులు, మినహాయింపులు ఉండడం సహజం.

ప్రజల హక్కుకు నష్టం చేయకుండా అవసరమైన మినహాయింపులను చట్టంలో ప్రవేశపెట్టవలసి ఉంటుంది. కానీ చట్టాలు రూపొందించే బ్యూరోక్రాట్లు ఏం చేస్తారంటే ఈ సహే

కారణంగా చూపించి మినహాయింపును చాలా 'ఉదార' మైన భాషలో రాస్తారు. ప్రజల న్యాయమైన సమాచార హక్కులను సహితం మినహాయింపుల కిందికి తీసుకొచ్చి తిరస్కరించే అవకాశం కల్పిస్తారు. తమిళనాడు చట్టంలోనూ గోవా చట్టంలోనూ ఇదే కనిపిస్తుంది. కేంద్రం కూడా ఒక సమాచార హక్కు చట్టం ముసాయిదా బిల్లు తయారుచేసే ఆలోచనలో ఉంది. దానికోసం ఒక మంత్రుల కమిటీని కూడా నియమించింది. ఆ బిల్లు ఏ రూపం తీసుకొంటుందో తెలియజేసే ఉదంతమొకటి ఈ మధ్య ఢిల్లీలో జరిగింది. కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖామాత్యుడు రాం జెఠ్మలానీ అక్టోబర్ 5వ తేదీన ఢిల్లీలో ఒక సదస్సులో మాట్లాడుతూ, పారదర్శక పాలన బిజెపి జాతీయ అజెండాలో ఒక ముఖ్య అంశం కాబట్టి, వేరే ప్రభుత్వ శాఖల సంగతి ఎట్లాగున్నా తన శాఖలో మాత్రం ప్రజలెవ్వరైనా ఏ సమాచారాన్నయినా 10 రూపాయల ఫీజు కట్టి పొందవచ్చుననీ (అంటే ఏ ఫైలయినా చూడవచ్చుననీ), మరొక 2 రూపాయలు చెల్లించి జెరాక్సు చేసుకోవచ్చుననీ ప్రకటించేశాడు.

పత్రికలన్నీ 6వ తేదీన ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. అక్కడితో ఆగకుండా జెఠ్మలానీ అక్టోబర్ 10వ తేదీన తనశాఖ సిబ్బందిని ఉద్దేశించి ఒక సర్క్యులర్ జారీ చేసి పై విషయానికి లిఖితరూపం ఇచ్చాడు. కేబినెట్ ఆమోదం కోసం ఆగివున్న ఫైళ్ళను, బడ్జెట్ ప్రతిపాదనలు మొదలయిన కొన్ని విషయాలను మాత్రం ప్రజల సమాచార స్వేచ్ఛనుండి మినహాయించాడు.

ఈ సర్క్యులర్ సంగతి తెలిసిన ప్రధానమంత్రి గాభరాపడి జెఠ్మలానీ సర్క్యులర్ అమలుకాకుండా ఆపమనీ, సమాచార హక్కు బిల్లు రూపొందించడం కోసం నియమించిన మంత్రుల కమిటీకి దానిని నివేదించమనీ, అసలు సంగతేమిటో కనుక్కొమ్మనీ కేబినెట్ సెక్రెటరీని ఆదేశించాడు. వారు కేంద్ర పట్టణ శాఖ ప్రత్యేక కార్యదర్శికి ఈ ఆదేశం తెలియజేశారు. ఆ అధికారి మంత్రి ప్రతిపాదన గురించి తన అభిప్రాయాలు తెలియజేసే లేఖ ఒకటి కేబినెట్ సెక్రెటరీకి రాశాడు. మంత్రి ప్రతిపాదనను 'విప్లవాత్మకమైనది'గా మెచ్చుకుంటూ, అదే సమయంలో దానివల్ల ఎన్ని అనర్థాలు రాగలవో ఏకరువు పెట్టాడు. ప్రజలు అడిగిన సమాచారం చెప్పేయడం ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకం కదా అన్నాడు. ముందు వాటిని సవరించకుండా మంత్రి ఈ సర్క్యులర్ జారీ చేయడం బాగాలేదన్నాడు. సంబంధిత ప్రభుత్వ శాఖను సంప్రదించవలసి ఉండిందన్నాడు. పైగా సమాచారం ఇచ్చేయడం దేశ భద్రతకు భంగకరం కాగలదు కాబట్టి హోం మంత్రిత్వశాఖను కూడ సంప్రదించి ఉండవలసిందన్నాడు. మంత్రి కొన్ని మినహాయింపులు పెట్టడం బాగానే ఉందని అంటూ, అయితే ఇంకా చాలా మినహాయింపులు అవసరమనీ, వాటిని ఒక్కొక్కటిగా ఏకరువు పెట్టడం కష్టమనీ, అయితే ఒక్క వాక్యంలో చెప్పాలంటే 'ప్రభుత్వానికి గానీ ఆ ప్రభుత్వ శాఖకుగానీ నష్టకరమైనట్టయితే అడిగిన సమాచారం ఇవ్వకుండా ఉండే అధికారం' ఉండాలన్నాడు!

ఈ లేఖను ఆ ప్రత్యేక కార్యదర్శి కేబినెట్ సెక్రెటరీకి పంపుతూ దాని ప్రతి ఒకటి తన మంత్రి (రాం జెఠ్మలానీ)కి కూడ పంపాడు. ఆయన దానిని చదివి మండిపడ్డాడు. సమాచార స్వేచ్ఛ గురించి సుప్రీంకోర్టు ఏమేం చెప్పిందో వివరిస్తూ ఒక నోట్ రాసి తాను కూడ కేబినెట్ సెక్రెటరీకి పంపించాడు. అయినప్పటికీ తన శాఖలోనయినా సమాచార స్వేచ్ఛ ప్రవేశ పెట్టడానికి తాను మొదలు పెట్టిన ప్రయత్నాన్ని వెనక్కి తీసుకోక అతనికి తప్పలేదు.